

గ్రీవెన్స్ కమిటీ కార్యాలయం ప్రారంభించి పరిశీలిస్తున్న కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

## సీజ్ అయిన నగదు గ్రీవెన్స్ కమిటీ ద్వారా పొందవచ్చు : కలెక్టర్

సూర్యాపేట, మార్చి 22 : ఎన్నికల నేపథ్యంలో సీజ్ అయిన నగదు విడుదల కోసం కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ కమిటీ ఏర్పాటు చేశామని, సరైన ఆదారాలతో నగదు తిరిగి పొందవచ్చని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్. వెంకట్రావ్ తెలిపారు. కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ కమిటీ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎన్నికల కోడ్ ఉన్న సమయంలో ఒక వ్యక్తి రూ. 50 వేలలోపు నగదు మాత్రమే వెంట తీసుకెళ్లేందుకు అనుమతి ఉందన్నారు. ఆధారాలు లేకుండా ఎక్కువ మొత్తంలో నగదు తీసుకుపోవద్దని సూచించారు. నిబంధనలు అతిక్రమించి ఎక్కువ మొత్తంలో నగదు దొరికితే వాటిని సీజ్ చేసి జిల్లా ట్రెజరీలో జమ చేస్తామన్నారు. పది లక్షల రూపాయలకు పైగా నగదు పట్టుబడితే ఆదాయాపు పన్ను శాఖకు అప్పగిస్తారని తెలిపారు. అకౌంట్ పాస్‌బుక్, ఏటీఎం చిట్టి, వస్తువులు, ధాన్యం విక్రయ నగదు సంబంధిత బిల్లులు, లావాదేవీల వివరాలు చూపించాల్సి ఉంటుందన్నారు. జిల్లా గ్రీవెన్స్ కమిటీ ఇన్‌చార్జిగా జిల్లా పరిషత్ సీఈఓ అప్పారావును నియమించామని, ఆయన ఫోన్ నంబర్ 8374566222లో సంప్రదించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ అప్పారావు, డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, జడ్పీ డిప్యూటీ సీఈఓ శిరీష, ఏఓ సుదర్శన్‌రెడ్డి , శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

## సరిహద్దులో అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ రాహుల్ హెగ్డే



వాహనాల తనిఖీని పరిశీలిస్తున్న ఎస్పీ

కోదాడ రూరల్, మార్చి 22 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దులో అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రతి వాహనాన్ని క్షుణంగా పరిశీలించాలని ఎస్పీ రాహుల్ హెగ్డే సూచించారు. శుక్రవారం ఆంధ్ర, తెలంగాణ సరిహద్దు సూర్యాపేట జిల్లా కోదాడ మండల పరిధి నల్లబండగూడెం శివారులోని రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన రాష్ట్ర సరిహద్దు తనిఖీ కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. రెండు వైపులా తనిఖీ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని, అనుమానాస్పద వ్యక్తుల సంచారాన్ని ప్రజలు అధికారులు అందించాలని కోరారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన తనిఖీ కేంద్రాల్లో రూ.84 లక్షలు సీజ్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో విజయవాడ రూరల్ డీసీపీ శ్రీనివాస్‌రావు, నందిగామ ఏసీపీ రవికిరణ్, కోదాడ డివిజన్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# పంటలు ఎండుతున్నా పట్టించుకోని ప్రభుత్వం

## చేరికల కోసం గేట్లు ఎత్తడం కాదు.. సాగర్ గేట్లు ఎత్తి సాగు నీరు ఇవ్వండి

- కాంగ్రెస్ 100 రోజుల పాలనలో అంతా కరువు అలుముకున్నది
- కేసీఆర్ సీఎంగా ఉంటే వెంటనే నీళ్లు ఇచ్చేవారు
- రైతులపై కనికరం లేని జిల్లా మంత్రులు
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- అనుముల మండలంలో ఎండిపోయిన పంటల పరిశీలన

**పార్టీలో చేరికల కోసం కాంగ్రెస్ పార్టీ నాయకులు గేట్లు ఎత్తడం కాదు, ముందు నాగార్జున సాగర్ ఎడమ కాల్వ గేట్లు ఎత్తి సాగు నీరు ఇచ్చి నల్లగొండ జిల్లా రైతాంగాన్ని ఆదుకుంటే బాగుంటుందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. అనుముల మండలం చల్మారెడ్డిగూడెం, కొట్టాల గ్రామాల్లో నీళ్లు లేక ఎండిపోయిన వరి పొలాలను శుక్రవారం ఆయన ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నోముల భగత్ కుమార్, రవీంద్రకుమార్, మాజీ ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్, యాదాద్రి భువనగిరి జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేతగానితనం వల్ల రైతులు రోడ్డున పడ్డారని, కాంగ్రెస్ 100 రోజుల పాలనలో అంతా కరువు అలుముకుందని ఆవేదన వ్యక్తం చేశారు.**

– హాలియా, మార్చి 22



అనుముల మండలం చల్మారెడ్డిగూడెంలో ఎండిన వరి పొలాలను పరిశీలిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, యాదాద్రి జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్, మాజీ ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్, తదితరులు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణను దోచుకొని ఢిల్లీకి ముడుపులు చెల్లిస్తున్నారని ఆరోపించారు. సాగు నీరు లేక రైతులు ఇలా ఇబ్బంది పడుతుంటే ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఉంటే ఎలాగైనా సరే రైతులకు నీళ్లు అందించేవారని తెలిపారు. పంటలు ఎండిపోతుంటే ఏ ఒక్క మంత్రిగానీ, ఎమ్మెల్యేగానీ కన్నెత్తి చూడడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాగార్జున సాగర్ ఎడమ కాల్వ కింద టేలాండ్ అనే పదమే వినపడకుండా చివరి భూములకు సాగునీరు ఇచ్చిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదని చెప్పారు. కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చుక్క నీటిని కూడా అందించడం లేదని విమర్శించారు. మేజర్ల వద్ద పోలీసులను కాపలా పెట్టి పాలేరు జలాశయానికి నీళ్లు ఇచ్చారు, కానీ ఇక్కడ ఎండుతున్న పంట పొలాలకు మాత్రం నీళ్లు ఇవ్వలేదన్నారు. ఒక్క తడి నీళ్లిస్తే పంటలు గట్టెక్కేవని తెలిపారు. ఒక్క సాగర్ ఆయకట్టు కిందనే రెండు లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని, రైతులు కోట్ల రూపాయలు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నాణ్యమైన కరెంట్ లేక మోటర్లు కాలిపోతున్నాయన్నారు. జిల్లా మంత్రులు కల్లుతాగిన కోతిలా ఎగిరెగిరి పడుతున్నారని, కానీ రైతు సమస్యలపై పట్టింపు లేదని విమర్శించారు. మిల్లర్లతో కుమ్మకై మంత్రులు ధాన్యానికి గిట్టు బాటు రాకుండా రైతుల నోట్లో మట్టి కొడుతున్నారని ఆరోపించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని కోరారు.

ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఆవుల పురుషోత్తం, కేవీ రామరావు, చెన్ను సుందర్ రెడ్డి, పిడిగం నాగయ్య, తాటి సత్యపాల్, అల్లి పెద్దిరాజు, లక్ష్మణ్‌నాయక్, చింతకాయల వెంకటేశ్వర్లు, నల్లగొండ సుధాకర్, మెరుగు రామలింగయ్య, దుండిగల్ల నర్సింహ, వడ్డె సతీశ్‌రెడ్డి, బొమ్మిశెట్టి ఆంజనేయులు, సురభి రాంబాబు, షేక్‌గౌస్, అబ్దుల్ హాలీం, దోరేపల్లి వెంకన్న, నడ్డి లింగయ్య, అంజత్‌ఖాన్ పాల్గొన్నారు.

## వన్య ప్రాణుల సంరక్షణకు చర్యలు

- ఎఫ్‌డీఓ సర్వేశ్వర్



కంబాలపల్లి అటవీ ప్రాంతంలో సాసర్ పిట్స్‌లో నీటిని పరిశీలిస్తున్న ఎఫ్‌డీఓ సర్వేశ్వర్

చందంపేట, మార్చి 22 : వేసవిలో నల్లమల అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల సంరక్షణకు అటవీ శాఖ ఆధ్వర్యంలో చర్యలు చేపడుతున్నట్లు ఎఫ్‌డీఓ సర్వేశ్వర్ తెలిపారు. మండలంలోని చిత్రియాల, కంబాలపల్లి, పాత కంబాలపల్లి, పెద్దమూల గ్రామాల్లోని అటవీ ప్రాంతాన్ని శుక్రవారం ఆయన పరిశీలించి బీట్ ఆఫీసర్లకు పలు సూచనలు చేశారు. వేసవిలో వన్య ప్రాణుల దాహార్తి తీర్చేందుకు సాసర్ పిట్స్‌లో నీటిని నింపడంతోపాటు బోర్లు వేయించాలని సూచించారు. బీట్ ఆఫీసర్లు అటవీ ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేసి అడవి జంతువుల సంచారాన్ని గుర్తించి ఆ దిశగా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే నల్లమల అటవీ ప్రాంతంలో మూడు బోర్లు వేయించామని, కొత్తగా 8 సాసర్ పిట్స్ ఏర్పాటు చేశామని అన్నారు. వన్య ప్రాణులను వేటాడినా, వాటికి హాని కలిగించినా చట్టరీత్యా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రైతులు, పశువుల పెంపకందారులు అటవీ ప్రాంతంలోకి ప్రవేశించరాదన్నారు. ఆయన వెంట ఎఫ్‌ఆర్‌ఓలు సాయిప్రకాశ్, భాస్కర్, సెక్షన్ ఆఫీసర్ శ్రీదేవి, రాగ్యానాయక్, సైదులు ఉన్నారు.

# వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళిక మారాలి

- జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయ డైరెక్టర్ రఘురాంరెడ్డి
- నల్లగొండలో ముగిసిన దక్షిణ తెలంగాణ మండల వ్యవసాయ అధికారుల సమావేశం




సమావేశంలో పాల్గొన్న అధికారులు, శాస్త్రవేత్తలు

నల్లగొండ, మార్చి 22 : మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళిక మార్చాలని జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం రీసెర్చి డైరెక్టర్ పి.రఘురాంరెడ్డి, విశ్వ విద్యాలయం ఎక్స్‌టెన్షన్ డైరెక్టర్ వి.సుధారాణి, పాలెం పరిశోధన కేంద్రం ఏడీఆర్ ఎం.మల్లారెడ్డి రైతులకు సూచించారు. నల్లగొండ కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం, పాలెం వ్యవసాయ పరిశోధనా కేంద్రం, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన దక్షిణ తెలంగాణ మండల వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా సంఘం సమావేశంలో వారు పాల్గొన్నారు. 2024– 25 సంవత్సరంలో వానకాలం, యాసంగి సీజన్‌లలో చేపట్టాల్సిన పరిశోధనలు, విస్తరణ అంశాల గురించి రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులతో చర్చిస్తూ రెండోరోజు ముగింపు సందర్భంగా పలు అంశాలుపై మాట్లాడారు. రైతులు సాగులో పంటల వైవిధ్యత, యాంత్రీకరణతో పంటల సాగుపై దృష్టిని సారించి కూలీల కొరతను అధిగమించే దిశగా చైతన్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు ఆ దిశగా పరిశోధనలు చేయాలని సూచించారు. 25 శాతం మంది పైచిలుకు రైతులు వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి వచ్చే విస్తరణ సేవలను పొందుతున్నారని, పరిశోధనలో సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు క్షేత్రస్థాయిలో ప్రదర్శనలు నిర్వహించి అవగాహన కల్పించాలని తెలిపారు. పరిశోధన ఫలితాలు ప్రతి రైతుకు అందించగలిగినప్పుడే ఉపయోగం ఉంటుందన్నారు. శాస్త్రవేత్తలు, విస్తరణాధికారులు మమేకమై వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పరుస్తూ కొత్త పుంతలు తొక్కించాలని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం పప్పు దినుసులు, నూనె గింజల పంటల విస్తీర్ణం పెంచేందుకు కృషి చేస్తున్నదని, రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అవగాహన కలిగించాలని అన్నారు. ప్రతి సీజన్‌లో రైతుకు కావాల్సిన అవసరాలు తెలుసుకొని ఆ దిశగా ముందుకు సాగాలని, మార్కెట్‌లో డిమాండ్‌కు అనుగుణంగా పంటల సాగు చేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. రాబోయే వానకాలంలో వేసే పంటల సాగుపై వ్యవసాయ శాస్త్రవేత్తలు పక్కా ప్రణాళికతో ఉండాలన్నారు. పాలెం పరిశోధన కేంద్రంలో చేస్తున్న పరిశోధన ఫలాలను డాక్టర్ ఎస్. వాణిశ్రీని, వాతావరణ పరిస్థితులపై డాక్టర్ లలితా రాణిని వివరించాలని కోరగా, వారు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆపత్కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. వ్యవసాయ స్థితిగతులు, ఎదుర్కొంటున్న సమస్యలు తదితర అంశాలపై ఆయా జిల్లాల వ్యవసాయాధికారులు సమావేశంలో వివరించారు. రాబోయే వ్యవసాయ పరిశోధనలు, విస్తరణ అంశాలపై చర్చించారు. అనంతరం డాక్టర్ సుధారాణి ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకొని వాటర్ ఫర్ పీస్ అనే వీడియోను ఆవిష్కరించారు. అదే విధంగా వ్యవసాయంలో నేటి ప్రాముఖ్యత, నీటి సంరక్షణ అనే అంశంపై డాక్టర్ అనిల్ కుమార్ వివరించారు. ఆ తర్వాత దక్షిణ తెలంగాణ మండల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై రైతులు, శాస్త్రవేత్తలను పదకొండు గ్రూపులుగా విభజించి పరిశోధన, విస్తరణ విభాగంలో పొందు పరిచారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి పాల్వాయి శ్రవణ్ కుమార్, ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్లు డా. భరత్ భూషన్ రావు, లక్ష్మణ్, కేవీకే, పాలెం, కంపాసాగర్ కోఆర్డినేటర్లు ప్రభాకర్ రెడ్డి, సుల్తాన్, శ్రీనివాస్, లావణ్య, రమణారెడ్డి, శ్రీధర్ రెడ్డి, ఆయా జిల్లాల అధికారులు, రైతులు పాల్గొన్నారు.



ఎంజీయూ పాలక మండలి సభ్యులను సన్మానిస్తున్న వీసీ గోపాల్‌రెడ్డి

## వర్సిటీ అభివృద్ధికి పాలక మండలి తోడ్పాటు ఎనలేనిది

**ఎంజీయూ వీసీ గోపాల్‌రెడ్డి**

రామగిరి, మార్చి 22 : పలు విధాన నిర్ణయాల్లో కీలక భాగస్వామిగా ఉండి యూనివర్సిటీ అభివృద్ధికి పాలక మండలి చేసిన కృషి ఎనలేనిదని మహాత్మా గాంధీ యూనివర్సిటీ వీసీ చొల్లేటి గోపాల్‌రెడ్డి అన్నారు. ఎంజీయూ పాలక మండలి సభ్యుల వీడ్కోలు సమావేశం శుక్రవారం వర్సిటీలోని ఆర్ట్స్ బ్లాక్ సమావేశ మందిరంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ పాలక మండలి నిర్ణయాలతో యూనివర్సిటీలో పనిచేస్తున్న ఉద్యోగులకు న్యాయం చేశామని, పలు విద్యాపరమైన ప్రగతిశీల నిర్ణయాలలో నేడు ఎంజీయూ ఆదర్శప్రాయంగా నిలిచిందని తెలిపారు. పరీక్షల విభాగంలో పూర్తి స్థాయి డిజిటలైజేషన్ ద్వారా ప్రక్షాళన, ఇతరత్రా హేతుబద్ధ నిర్ణయాలకు సభ్యులు తోడ్పాటునిచ్చారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ అల్వాల రవి, మాజీ పాలకమండలి సభ్యులు కొప్పుల అంజిరెడ్డి, ఆకుల రవి, శ్రీదేవి, బోయపల్లి కృష్ణారెడ్డి, ఘన శ్యామ్, కోయి కోటేశ్వర రావు, సూర్యనారాయణ రెడ్డి, సవీందర్ కుమార్, సోమ రమేశ్, ఎంజీయూ సీఓఈ ఉపేందర్‌రెడ్డి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ మూల్యాంకనం కేంద్రానికి బోర్డు అధికారులు

- అధ్యాపకులు కేటాయింపులు.. ఇతర అంశాలపై ఆరా
- డీఐఈఓ వ్యవహార శైలి, మూల్యాంకనంపై కమిషనర్‌కు నివేదిక
- అధికారులను ముట్టడి చేసే ప్రయత్నం చేసిన మోడల్ స్కూల్ టీచర్స్



ఇంటర్ బోర్డు అధికారులతో వాగ్వాదం చేస్తున్న మోడల్ స్కూల్ అధ్యాపకులు, క్యాంపు అధికారులు

రామగిరి, మార్చి 22 : నల్లగొండలోని ఇంటర్మీడియట్ మూల్యాంకనం కేంద్రాన్ని శుక్రవారం రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు సందర్శించారు. ప్రాధాన్యత ప్రకారం మూల్యాంకనం విధులను కేటాంపులు చేయలేదని, డీఐఈఓ దస్రూనాయక్ వ్యవహార శైలిపై ప్రభుత్వ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ నల్లగొండ జిల్లా బాధ్యులు గురువారం జిల్లా కలెక్టర్ దాసరి హరిచందనకు ఫిర్యాదు చేయడంతోపాటు పలు పత్రికల్లో వచ్చిన కథనాలకు స్పందించి అధికారులు వచ్చారు. తొలుత వాల్యూయేషన్‌లో ఉన్న అధ్యాపకుల వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు. అనంతరం క్యాంపు అధికారి, డీఐఈఓ కేటాయించిన సీఎస్, ఏఈ ఇతర విధుల్లో ఉన్న అధ్యాపకుల వివరాలు, సీనియారిటీ, బోర్డు నిబంధనల మేరకు ఉన్నాయా..? లేదా అనే విషయాలను పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. అదే విధంగా శుక్రవారం ప్రారంభమైన కెమిస్ట్రీ, కామర్స్ సబ్జెకుల విధుల్లో హాజరు వివరాలు, సీనియారిటీ ప్రకారం ఇచ్చారా లేదా అని చూశారు. ఈ క్రమంలో సందర్శనకు వచ్చిన బోర్డు అడిషనల్ డైరెక్టర్ చిత్రం యాదగిరి, శ్రీనివాస్‌ను ముట్టడి చేసే ప్రయత్నం చేయడంతో వారు నివేదికలను రాష్ట్ర కమిషనర్‌కు ఇస్తామని, ఆ తదుపరి బాధ్యులపై చర్యలు ఉంటాయని వెళ్లినట్లు సమాచారం. ఇదిలా ఉంటే సందర్శనకు వచ్చిన అధికారులకు మూల్యాంకనంలో జరిగే తప్పులు, ఇతర వివరాలను నమోదు చేస్తూ ప్రభుత్వ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ బాధ్యులు వినతి పత్రం అందించినట్లు తెలిపారు.

## కనులపండువగా రాములోరి రథోత్సవం



రాములబండలో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

నల్లగొండ రూరల్, మార్చి 22 : మండలంలోని రాములబండ గ్రామంలో సీతారామచంద్ర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రథోత్సవ వేడుకను కనులపండువగా నిర్వహించారు. రథోత్సవానికి ఆలయ నిర్వాహకులు దోమలపల్లి వంశీయులతోపాటు జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ పరిసరాల్లో భారీ రథంలో స్వామివారిని ఊరేగించారు. వేడుకల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీటీసీ లక్ష్మయ్య, ఆలయ నిర్వాహకులు దోమలపల్లి ప్రభాకర్‌రావు, విజయ్‌కుమార్, అమరేందర్‌రావు గ్రామ మాజీ సర్పంచ్ జయమ్మ పెద్దులు, నాయకులు మోహన్ రెడ్డి, శంకర్, ప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

- రాష్ట్ర వైద్యశాఖ జాయింట్ డైరెక్టర్ శివబాలాజీరెడ్డి
- రోగాల బారిన పడిన ఇందుగుల గ్రామ సందర్శన



బాధితులతో మాట్లాడుతున్న రాష్ట్ర వైద్యశాఖ జాయింట్ డైరెక్టర్ శివబాలాజీరెడ్డి

మాడ్గులపల్లి, మార్చి 22 : పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులను దూరం చేయవచ్చని రాష్ట్ర వైద్యశాఖ జాయింట్ డైరెక్టర్ శివబాలాజీరెడ్డి అన్నారు. మండలంలోని ఇందుగుల గ్రామాన్ని శుక్రవారం ఆయన సందర్శించి రోగాల బారిన పడిన బాధితులతో మాట్లాడారు. అనంతరం వైద్యాధికారులతో మాట్లాడుతూ గ్రామంలో రోగాల బారిన పడిన బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. బాధితులు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లకుండా గ్రామంలోని పల్లె దవాఖానలో అన్ని పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించాలని సూచించారు. గ్రామంలో తాగునీటి శాంపిల్స్‌తో పాటు బాధితుల రక్త నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపించాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరుచాలని, డ్రైనేజీల్లో చెత్తాచెదారం లేకుండా చూడాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్టేట్ ఎపిడమాలజిస్ట్ మోహన్, మైక్రో బయాలజిస్ట్ ముక్కంటేశ్వర్, డిప్యూటీ డీఎంహెచ్ఓ వేణుగోపాల్‌రెడ్డి, డీఎంఓ దుర్గయ్య, వైద్యులు ఫిర్దోస్, ఇక్తియాజ్, ల్యాబ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి : మంత్రి కోమటిరెడ్డి

ఇందుగుల గ్రామంలో వ్యాధుల బారిన పడిన బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వైద్యాధికారులను ఆదేశించారు. వైద్యాధికారులు ఇందుగుల గ్రామాన్ని సందర్శించి బాధితులకు అన్ని రకాల వైద్య సదుపాయం అందించి రోజువారి నివేదికను పంపించాలన్నారు. గ్రామంలో పరిస్థితులు మెరుగయ్యే వరకు వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.